International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.4, Issue-12(2), December, 2017
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

# కందుకూరి, చిలకమర్తి వారి రచనలు – స్త్రీ పాత్రలు

డా॥ ద్వివేది కృష్ణ గాయత్రి
తెలుగు అధ్యాపకురాలు
వి.కె.వి ప్రభుత్వ కళాశాల, కొత్తపేట

ఆధునిక కాలంలో సాహిత్యంలోను, సమాజంలోను పునరుజ్జీవనం ప్రారంభమయింది. ఈ సమయంలో ఆంధ్ర దేశంలో యుగపురుషుడైన కందుకూరి వీరేశలింగం గారు సంఘ సంస్కరణకు సాహిత్యాన్ని ఆయుధంగా తీసుకొని సాంఘికోద్యమం ప్రారంభించారు. వారి ప్రధాన ఆశయాలు బాల్య వివాహాలను అపుచేయడం, వితంతు పునర్వివాహాలను జరిపించడం, స్త్రీ విద్య, స్త్రీ జనాభ్యుదయం. ఇంట్లో స్త్రీ చదువుకుంటే కుటుంబమంతా సంస్కరిచబడుతుందనే ఆశయంతో ఈయన స్త్రీ విద్యను ప్రోత్సహించారు. బాలికల కొఱకు పాఠశాలలను స్థాపించారు. ఆధునిక సాహిత్య ఆరంభకుడిగా కందుకూరి వారు ప్రక్రియా వైవిధ్యంతో శతాధిక రచనలు చేశారు. వేలాది మంది కందుకూరి వారి శిష్యులలో ప్రథమ శిష్యుడు శ్రీచిలకమర్తి లక్ష్మీ నరసింహంగారు. వీరిద్దరి నవలలో ఇతివృత్తము, స్త్రీ పాత్రల చిత్రణ తరువాతి రచయితలకు మార్గదర్శకమైంది.

నవలా సాహిత్యానికి శ్రీకారం చుట్టిన రచన రాజశేఖర చరిత్ర. కథా నిర్మాణంలో, శైలిలో, సామాజిక వాస్తవికతా ప్రతిబింబంలో ప్రశస్తమైన రచన ఇది. చింతామణి పత్రిక నవలల పోటీని నిర్వహిస్తూ మార్గదర్శక సూత్రాలను వివరిస్తూ 'రాజశేఖర చరిత్ర చదివి నవల ఎలా వ్రాయాలో తెలుసుకోవచ్చునని తెలిపింది. 'వివేక చంద్రిక' అనే నామాంతరం కూడా కలిగిన ఈ నవలా రచయిత కందుకూరి వీరేశలింగం గారు. అప్పటికే సతీహితబోధిని అనే పత్రిక స్థాపించి స్త్రీ విద్యను గురించి, వితంతు పునర్వివాహాలను గూర్చి ప్రోత్సాహ పూర్వకమైన కృషి చేస్తూ సనాతనులను ఎదిరిస్తూ వచ్చారు కందుకూరి వారు. ఆనాటి సమాజంలోని స్త్రీలు ఎలా ఉండేవారో, వారి కట్టుబాట్లను గురించి తన రచనలలో ప్రస్తావించారు శ్రీ కందుకూరివారు. 1883 సం॥లో స్త్రీల కొఱకు సత్యవతీ చరిత్రను రచించారు. ఇందులో కథానాయకురాలు సత్యవతి. ఈ రెండు నవలలోని స్త్రీ పాత్రలు ఆనాటి సమాజంలో స్త్రీలు ఎలా జీవించారో, వారి స్థితిగతులను తెలియజేస్తాయి.

రాజశేఖర చరిత్రలో రుక్మిణి విద్యావంతురాలు. ధైర్యసాహసాలు గల యువతి. ఈమె కథానాయిక కాకపోయినా, ప్రత్యేక లక్షణాలు గలిగి పాఠకులను ఆకట్టుకునే వ్యక్తిత్వం కల్గిన పాత్ర. ఈమెకు చిన్నతనంలో పెండ్లి అయింది. భర్త చదువులకోసం కాశీకి వెళ్ళాడు. ఈమెకు చదువుకోవాలన్న ఆసక్తి ఎక్కువ. ఆయె ఇష్టాన్ని గమనించి తండ్రి రాజశేఖరుడు ఆమెకు చదువు చెప్పించాడు. రాజశేఖరుడు ధనవంతుడు. అందుకని ఎదురుపడి స్త్రీలకు విద్య అనవసరం అని ఆనాటి పండితులు అనలేక ఒక పెద్దాయన చేత పెద్దలందరూ లోగిలిలో కూర్చుని ఉండగా "మన ఇంటా వంటా స్త్రీలు చదువుకోవటం లేదు. రుక్మిణికి చదువెందుకు? అనిపించారు. కాని రాజశేఖరుడు అంగీకరించలేదు. అమ్మాయి ఇష్టపడింది. ఏ శాస్త్రాలు స్త్రీ విద్యను నిషేధించిన ఆధారాలు లేవు. నేనామెని చదివిస్తానన్నాడు రాజశేఖరుడు. మరెవ్వరూ మాట్లాడలేకపోయారు. అలా రుక్మిణి తండ్రి ప్రోత్సాహంతో విద్యనభ్యసించింది. కొంతకాలానికి దేశాంతరగతుడైన ఆమె భర్త మరణించినట్లు తెలుస్తుంది. పెద్దలందరూ శిరోముండనం చేయించమని రాజశేఖరునిపై పత్తిడి తెస్తారు. కాని రాజశేఖరుడు అంగీకరించడు. రుక్మిణి జుట్టు తీయించడు. ఓడలు బండ్లయి బండ్లు ఓడలయినట్లు దానధర్మాలు చేసి రాజశేఖరుడు బీదవాడై కుటుంబంతో కాశీ యాత్రకు బయలుదేరాడు. దారిలో దొంగలు పడి రుక్మిణి తలపై కొట్టి ఆమె చేతిలో పెట్టెను అందుకొని పారిపోతారు. రుక్మిణి మరణించిందని అందరూ భావించి అర్ధరాత్రి ఏమీ చేయలేక ఆమెను అక్కడే వదిలి జంతుభయంతో ఒక ఊరిలో ప్రవేశిస్తారు. రుక్మిణికి అర్ధరాత్రి మెలకువ వస్తుంది. అర్ధరాత్రి ఆ అడవిలో తనవారెవరూ కనిపించక మొదట భయపడుతుంది. దగ్గరలో ఊరు ఏదైనా ఉందేమోనని బయలుదేరటానికి ఉద్యుక్తురాలవుతుంటే ఆ ప్రక్కనే ఒక మొండెం, మొండెం ప్రక్కన ఒక మూట కనిపిస్తుంది. సమాజంలో స్త్రీ తన నిజ రూపంతో ఒంటరిగా చరించడం ప్రమాదమని ఆలోచిస్తూ

ఆ మూట తెరుస్తుంది. అందులో పురుషులు ధరించే వస్త్రాలు తప్ప మరేమీ ఉండవు. ఆమె తన బట్టలపైనే ఆ వస్త్రాలు ధరించి పురుషునిగా వేషం వేసుకొంటుంది. అక్కడ నుండి బయలుదేరి దగ్గరలో ఉన్న మరో గ్రామం చేరి తన వద్ద నున్న నగనమ్మి ఆ డబ్బుతో కాలం గడుపుతూ సుబ్బారాయుడు అని పేరు పెట్టుకొని జీవిస్తూ ఉంటుంది. ఆ ఊరి కరణం వద్ద లెక్కలు పద్దులు వ్రాస్తూ ఉంటుంది. తన చెల్లెలు సీతను ఎవరో ఎత్తుకొని పోతూ ఉంటే చూసి వారిని మీరెవరని నిలదీసి గట్టిగా అడుగుతూ ఉండగా రామరాజు వచ్చి దుండగులను తన్ని తరిమివేస్తాడు. కరణం గారికి చెప్పి చెల్లెలిని తీసుకొని తండ్రి దగ్గరకు బయలుదేరుతుంది. కొంతదూరం రామరాజు కూడా వారిని అనుసరించి తరువాత వెళ్ళి పోతాడు. ఊరిలో ప్రవేశించగానే చెల్లెలు సీత ఈ వ్యక్తి ఎవరో తెలియక అంతవరకు భయం భయంగా అనుసరిస్తూ ఆమెను వదిలి తనకు తెలిసిన దోవ ద్వారా తల్లి దగ్గరకు చేరుతుంది. తమకు ఇదివరకు తెలిసిన వ్యక్తి ఎవరో ఈ ఊరిలో దించాడని అతడు కాసేపట్లో రాగలడని తల్లికి చెపుతుంది సీత. సుబ్బారాయుడు వీధులలో తిరుగుతూ మధ్యాహ్ననికి ఇల్లు తెలుసుకొని తల్లిని చూసి అప్పుడు తన నిజ రూపం బయటపెట్టి రుక్మిణిగా బయల్పడతాడు. రుక్మిణి మీరు విద్య నేర్పించడం వలన వివేకాన్ని, ధైర్యాన్ని పొంది సమస్యల నుండి బయల పడగలిగానని తండ్రితో చెప్పింది. ఈ విధంగా మొట్టమొదటి నవలలో స్త్రీగా రుక్మిణి పాత్ర స్త్రీ అభ్యుదయానికి ఒరవడిగా మలచబడింది. సమాజ వికాసానికి స్త్రీలకు విద్యా వికాసాలు అనివార్యమనే కందుకూరి వారి భావనకు ప్రేరణగా ఈ పాత్ర మలచబడింది.

ఈ నవలలోని తక్కిన స్త్రీ పాత్రలలో ఆనాటి సమాజ స్థితి కనపడుతుందే తప్ప ప్రత్యేక లక్షణాలు లేవు. రాజశేఖరుడి చెల్లెలు సుబ్బమ్మ బాల వితంతువు. అన్నగారి వద్దనే ఉండి వంటపని రెండు పూట్లా చేస్తూ ఉంటుంది. ఈమెకు బాగా అనారోగ్యం చేసినపుడు "చేతిలో డబ్బు లేనపుడు రోగాలు తెచ్చుకుంటారు. మీరు అని, పదిసార్లు స్నానాలు చెయ్యకపోతేనేం. ఇప్పుడు వంట పనికి ఎంత ఇబ్బంది" అని విసుక్కుంటాడు. ఇక్కడ రాజశేఖరుడు పదిసార్లు స్నానాలు చెయ్యవద్దన్నది వంటకిబ్బంది అనిగాని సుబ్బమ్మ మీద ప్రేమతో కాదు. అప్పుడొక వంటవాడు ఉద్యోగం కోసం వెతుకుతూ రాజశేఖరుని ఇంటికి వచ్చి ఆ మాటలు విని 'ఆమెను మనసు పడినన్నాళ్ళు రోగం తెచ్చుకోనీయండి. నేను వంట చేస్తాను. ఆ పని నాకిప్పించండి' అంటాడు. అప్పటి వారికి ఆలోచనల్లో సుబ్బమ్మ లాంటి వారికి రోగం వస్తే అది మనసుపడి పని తప్పించుకోవడానికి తెచ్చుకునే రోగమే తప్ప అసలు రోగం కాదు. సుబ్బమ్మ మరో నాలుగు రోజుల్లో మరణిస్తుంది.

రాజశేఖర చరిత్ర తరువాత వ్రాయబడినది సత్యవతీ చరిత్ర. సమాజ బాధ్యతా నిర్వహణలో సమాజ వికాసానికి అనివార్యమైన విద్యా వికాసాలలో స్త్రీలు కూడా పురుషులతో సరిసమాన స్థాయి పొందితే తప్ప సమాజంలోని లోపాలు తొలగవని పంతులు గారి దృఢ విశ్వాసం. ఈ దృక్పథానికి అనుకూలంగా కుటుంబ సమస్యను ఇతివృత్తంగా తీసుకొని భార్యాభర్తలిద్దరూ చదువూ సంస్కారం కలవాళ్ళైతే తప్ప సమాజాభ్యుదయానికి నిలకడ కలగదని బోధించారు పంతులు గారీ నవలలో. ఈ నవలలోని సత్యవతీ నారాయణమూర్తుల జంట ఈయన ఆదర్శాలకు, లక్ష్యాలకు ప్రతిరూపం. ఈ నవల చదివి ఏ ఒక్క మహిళ లాభం పొందినా తన లక్ష్యం నెరవేరినట్లేనని భావించారు శ్రీ కందుకూరి వారు.

సత్యవతి తండ్రి ధనవంతుడు. కోర్టులో ఉద్యోగస్తుడు. ఈమె భర్త నారాయణమూర్తి. ఇంగ్లీషు చదువులపై ఆసక్తి గలిగి వారాలు చేసుకుంటూ, ట్యూషన్లు చెప్పుకుంటూ ఉన్నత చదువులు చదువుతూ ఉంటాడు. సత్యవతి కూడా బాలికోన్నత పాఠశాలకు వెళ్ళి చదువుకొంది. పెళ్ళయినా ఆమె ఇంటి వద్దనే ఉండి చదువు కొనసాగించింది. అత్తగారికి, ఆడపడుచులకు ఆమె చదువుకోవడం ఇష్టం లేదు. చిన్నాడపడుచు సీతకు తనే చదువు చెప్తూ ఎవరి మాటలు లెక్కచేయక ఓర్పుతో జీవిస్తుంది సత్యవతి. ఆమె అత్తగారిది ఆరడి పెట్టడంలో అందెవేసిన చెయ్యి. తోడికోడలు మాటలు పడని మనస్తత్వం కలది. ఇద్దరూ ఎప్పుడూ తగవులాడుకుంటూ ఉంటే సత్యవతి వీరిద్దరినీ బ్రతిమాలుతూ ఇంటి పని చేస్తూ మాటలు పడుతూ ఉంటుంది. పెద్దాడపడుచు బాల వితంతువు. ఆమె తల్లికి వత్తాసు పలుకుతూ సత్యవతిని తిడుతూ ఉండేది. ఆమె మామగారు ఇంటి గొడవలు పడలేక చెప్పాపెట్టకుంటా కాశీ యాత్రకు వెళ్ళిపోయాడు. సత్యవతి ఇంటి వారికీ పొరుగు వారికీ అవసరమైతే ధన సహాయం, చేతి సాయం కూడా చేస్తూ తలలో నాలుకలా ఉంటుంది. అత్తగారు మరణించారు. కుటుంబ భారం నారాయణమూర్తి మీద పడింది. పెద్దన్నగారు బాధ్యతలు వదిలి డబ్బు

పంచుకున్నాడు. నారాయణమూర్తి కుటుంబంతో రాజమహేంద్రి వచ్చి ప్రధానోపాధ్యాయునిగా ఉద్యోగం చేస్తూ 'లా' పరీక్షలకు కట్టుకుని లాయరయ్యాడు. వీరిద్దరి జీవనంలో కౌటుంబికమైన రోగాలు మొదలైన ఎన్నో సమస్యలు తలయెత్తాయి. విద్యాగంధం లేక మూఢ నమ్మకాలు ప్రబలి జీవనం దుర్భరం చేసుకున్న స్థితి సత్యవతి చుట్టూ ఉన్న పాత్రలలో కనపడుతుంది.

సత్యవతి ఎన్ని సమస్యలెదురైనా ధైర్యంగా ఎదుర్కొంటూ తోటి స్త్రీలను కూర్చోబెట్టి విద్య నేర్పేది. చిన్నాడపడుచు సీతకు వివాహమై కొద్ది కాలంలో భర్త మరణించాడు. సీతకు మళ్ళీ వివాహం చేయమని భర్తకు ఆలోచన చెప్పి సీత పునర్వివాహాన్ని గూర్చి నిశ్చయించింది సత్యవతి. ఈమె చదువు సంధ్యలు చెప్పి ప్రోత్సహించటం వల్లనే సీత మనస్సు చిన్నతనం నుండి వికసించి తన కాళ్ళపై తాను నిలబడి కుటుంబానికి సహాయం చెయ్యాలనే ఆలోచనతో బాలికల పాఠశాలలో కుట్టుపని ఉపాధ్యాయినిగా చేరడానికి తనంత తాను నిశ్చయించుకొంది.

సత్యవతి పాత్ర కేవలం కుటుంబంలో వ్యవహరించే స్త్రీ పాత్ర. లేనిపోని కయ్యాలకు, ఉబుసుపోని కబుర్లకు ఇష్టపడని పాత్ర. ఈ పాత్రలో మూఢచారాలకు లోను కాకపోవడం, వ్యక్తిత్వం కుటుంబ పరిధిలో మానసికంగా వికసించడం కనపడుతుంది. నవలా ప్రక్రియలోని తొలి ప్రయత్నం లోని ఈ రెండు రుక్మిణి, సత్యవతి పాత్రలు స్త్రీ విద్యను వ్యాప్తికి, వితంతు పునర్వివాహాలోచనకు మూఢాచారాల నిర్మూలనకు తావిచ్చిన ఆలోచనా పరిధి కలిగినవే. అయితే ఈ పాత్రలు రాబోయే నవలలో స్త్రీ జీవన వికాసం ఒక్కో మెట్టూ ఎక్కుతూ వచ్చి తండ్రి, భర్త లేక అన్నగారి సన్నిధిలోనో తమ సమస్యలను పరిష్కరించుకోవడం కాకుండా వారి నుండి ఎదురైన సమస్యలను కూడా తమంత తాము పరిష్కరించుకునే వ్యక్తిత్వ వికాసం కలిగిన పాత్రలు సృష్టించబడటానికి ఒరవడి అయ్యాయి.

సత్యవతి అత్తగారు శ్యామలాంబ అసలు అత్తగారికి ప్రతిరూపం. ఆమెది కోడండ్రికం పెట్టటంలో గట్టి చెయ్యి. తిట్టకూడని తిట్లన్నీ ప్రొద్దస్తమానం కోడళ్ళను తిడుతూ ఉండేది. మరణ సమయంలో తన తప్పు తెలుసుకొని సత్యవతిని క్షమించమని వేడుకొని మరణించింది. తోటికోడలు సుందరమ్మ ఏడుపు మహా మంత్రం తెలిసిన ఇల్లాలు. అత్తగారి మీద కోపం వస్తే భోజనం మానేసిజుట్టు విరబోసుకొని ఏడుస్తూ ఇంటివారికీ ప్రక్కింటి వారికీ కూడా మనశ్శాంతి లేకుండా చేసి తన పని సాధించుకుంటుంది. ఈ విభిన్న వ్యక్తిత్వాల సమాహారంలో రుక్మిణి, సత్యవతులు ఆధునిక భావాలు కల్గిన విద్యావంతులైన స్త్రీలు.

అనంతర కాలంలో వచ్చిన జానకి విముక్తి, స్వేచ్ఛ లాంటి నవలలలో స్త్రీలు సంఘ సంస్కరణ కార్యక్రమాలలో పాల్గొనడానికి కందుకూరివారి స్త్రీ పాత్రలు ప్రేరణనిచ్చాయి.

"ముదితల్ నేర్వగరాని విద్య కలదే ముద్దార నేర్పింపగన్" అంటూ కందుకూరి వారందంచిన స్త్రీ విద్యా భావనకు మరింత బలం చేకూర్చిన వారు శ్రీ చిలకమర్తి. పై పంక్తి సత్యభామ పాత్ర వర్ణనా సంబంధి అయినా నారీలోకమంతటికీ వర్తిస్తుంది. చిలకమర్తి వారు కందుకూరి వారి ఆదర్శాలను వంటబట్టించుకొని పూర్తిగా ఆచరించడానికి ప్రయత్నించిన వ్యక్తి. బ్రహ్మ సమాజ సిద్ధాంతాలను పూర్తిగా నమ్మినవారు. హరిజనాభ్యుదయము, స్త్రీ జనాభ్యుదయము ఎక్కువగా ఆకాంక్షించినవారీయన.

'సుధాశరశ్చంద్రము' అనే నవలలో సుధ 10 సం॥లకు వధువై 12 సం॥లకు విధవైంది. ఈమె తరువాత శరశ్చంద్రుని ప్రేమించి వివాహం చేసుకొంది. వితంతు పునర్వివాహం జరగాలన్న చిలకమర్తి వారి ఆలోచనకు ఈ నవల నిదర్శనం. కందుకూరి వారు రాజమహేంద్రి వదిలిన తరువాత చిలకమర్తి వారు 1902 లో తానే దగ్గరుండి పూనుకొని మూడు వితంతు పునర్వివాహాలను జరిపించారు. ఈ వివాహాలకు మాలపల్లి నవలా రచయిత శ్రీ ఉన్నవ వారు కూడా విచ్చేసారని స్వీయ చరిత్రలో వ్రాసుకున్నారు. శ్రీ చిలకమర్తి సాంఘిక, చారిత్రక, పౌరాణిక ఇతివృత్తాలను తీసుకొని నవలలు రచించారు. ఈయనవిగా చెప్పబడుతున్న మొత్తం 15 నవలలలో 10 నవలల పేర్లు నాయికా నామములే. చిలకమర్తివారి నవలలు : రామచంద్ర విజయం, గణపతి, రాజరత్నం, విజయలక్ష్మి, హేమలత, అహల్యాబాయ్, కర్పూరమంజరి, మణిమంజరి, కృష్ణవేణి, సువర్ణగుప్తుడు, శాపము, సౌందర్య తిలక, సుధాశరశ్చంద్రం, దాసీకన్య, శ్యామల.

రామచంద్ర విజయం, గణపతి, రాజరత్నం, విజయలక్ష్మి – ఇవి సాంఘిక నవలలు. రామచంద్ర విజయంలో రామచంద్రుని సుఖదు:ఖాలకు సంబంధించిన ఇతివృత్తం ప్రధానంగా ఉంటుంది. సమస్యలను అతడు ఏవిధంగా అధిగమించి విజయం పొందాడో వర్ణించబడింది. ఇతని భార్య పార్వతి. ఈమెకు ప్రత్యేక వ్యక్తిత్వం ఉన్నట్టుగా ఈ నవలలో కనిపించదు. విజయలక్ష్మి అనే నవల స్త్రీ విద్యావృద్ధిని ప్రచారం చేసే మార్గంలో రచించబడింది. స్త్రీ విద్య, స్త్రీ జనాభ్యుదయము, బాల్య వివాహాల ఖండనకు సంబంధించిన చిలకమర్తి అభ్నిసాయాలన్నీ కల్గినవాడు విజయలక్ష్మి తండ్రి రామేశం. ఈమె బాలికల పాఠశాలలో చేరి చదువుకుంది. గురువుగారి వద్ద కావ్యాలు చదివింది. బాల్యవివాహం చేయటానికి తండ్రి ఇష్టపడడు. తరువాత ఆమె వివాహం విశ్వనాథంతో నిశ్చయమవుతుంది. పెళ్ళి ప్రయత్నాల వరకు ఈ నవలను రచించి చిలకమర్తి కన్నుమూసారు. ఈ నవలలోని కథనాన్ని బట్టి స్త్రీ విద్య వలన కలిగే లాభాలను చిలకమర్తి వివరిస్తూ ఇతివృత్తాన్ని పెంచే ప్రణాళిక ఉన్నట్లు తోస్తుంది. కాని ఇది అసంపూర్తిగా ఆగిపోయింది.

రాజరత్నమనే నవల వరకట్న సమస్యకు సంబంధించినది. రాజరత్నం అమాయకురాలే కాని చక్కనిది. తెలివి కలిగినది. బడికి వెళ్ళి చదువుకుంటూ రామనాథ శాస్త్రి ద్వారా భారత భాగవతాలను చాలా చక్కగా అభ్యసించింది. ప్రథమ శాస్త్ర పరీక్షలో ఉత్తీర్ణుడైన జగన్నాథ రావునకు ఇచ్చి ఈమె వివాహం జరపాలని పెద్దలు నిశ్చయించారు. కాని కట్నం సమస్య వద్ద పెండ్లి ఆగిపోయింది. ఈమె అన్న కేశవరాజు, జగన్నాథరావు స్నేహితులు. జగన్నాథరావు తండ్రి శంకర్రాజు కట్నం లేకుండా వివాహం జరగడానికి అనుమతించదు. జగన్నాథరావే రాజరత్నం తండ్రికి తాను హామీగా ఉంటాడు. కాని పురుషోత్తమ రావు మరణించడంతో అప్పు తీర్చవలసి వచ్చింది, జగన్నాథరావుకు. శంకర్రాజుకు కోర్టు సమన్లు పంపిస్తుంది. తండ్రి కొడుకు మీద కక్ష గట్టడం తద్వారా సంభవించిన సమస్యలు – రాజరత్నం పరిస్థితులు ఇందులో వర్ణితం. నాయికల పేర్లే నవలల పేర్లుగా ఉన్నా ఇందులో నాయికలు తండ్రి లేదా భర్త చెప్పిన విధంగా నడుచుకున్నవారే తప్ప స్వతంత్ర నిర్ణయం తీసుకున్నవారు కారు.

చారిత్రక నవలలలో అహల్యాబాయ్ రాణి. ధర్మ రక్షణ ధ్యేయంగా జీవిస్తూ రాజ్యాన్ని పరిపాలిస్తూ ఉంటుంది. 'ఆడదాని పరిపాలనలో అణిగి మణిగి ఉండటం ఇష్టం లేని, తమ గౌరవం కోల్పోయినట్లు భావించిన కొందరు సామంత రాజులు రాజ్యంలో సృష్టించిన అల్లకల్లోలాలను అహల్యాబాయ్ సమర్థవంతంగా త్రిప్పికొడుతుంది. స్త్రీలు శక్తివంతులని, ఎంతటి కష్టసాధ్యములైన పనులైన వారు చేయగలరని విశ్వసించే చిలకమర్తి భావన ప్రాణం పోసుకొని అహల్యాబాయ్‌గా జీవించింది ఈ నవలలో. తక్కిన చారిత్రక నవలలలోని పాత్రలన్నీ ఇటువంటివే. ఇవన్నీ నవలారంభపు తొలిదశలో వెలువడిన నవలలు.

మధ్యాహ్న సమయాలలో రాజరత్నం అనవసరపు కబుర్లు చెప్పక అందరినీ కూర్చోబెట్టి పూర్వ కావ్యాల అర్థాల్ని వివరించి చెపుతూ ఉంటుంది. వరకట్న సమస్య వలన చెలరేగుతున్న అలజడి ఇందులో ప్రస్ఫుటమవుతుంది. కట్నం కోసం మామగారు కోడలికి విషం పెట్టబోయి పొరపాటున చివరకు తానే మరణిస్తాడు. 'గణపతి'లో పిచ్చమ్మ, నాగమ్మ కన్యాశుల్కానికి బలయ్యారు.

చిలకమర్తి వారి సమయంలోను, అనంతరకాలంలోను స్త్రీల జీవన విద్యాభ్యుదయము ఇతివృత్తాలతో అనేక నవలలు, కథలు వచ్చాయి. అంతేకాక సంఘ సంస్కరణ కొఱకు ఎన్నో నవలలు వచ్చాయి. వీటిలో సామాజిక సమస్యల విశ్లేషణ, పరిష్కారం కూడ రచయితలు చూపించారు. నవలా సాహిత్యానికి వెలుగుబాటలు వేసినవారు వీరిద్దరూ అనడంలో అతిశయోక్తి లేదు. అందుకే ఆవంత్స సోమసుందర్‌గారు శ్రీ కందుకూరి, శ్రీ చిలకమర్తిగారల సంఘ సంస్కరణ కార్యకలాపాలన్నింటినీ, వారి జీవన వృత్తాల్ని 'యుగ పురుషుడు, ఆయన శిష్యుడు' లో సంక్షిప్తంగా నిక్షిప్తం చేశారు.

**ఆధార గ్రంథాలు :**

1. శ్రీ కందుకూరివారి రచనలు
2. శ్రీ చిలకమర్తివారి రచనలు
3. శ్రీ చిలకమర్తి – ముక్తేవి భారతి
4. యుగపురుషుడు, ఆయన శిష్యుడు – ఆవంత్స సోమసుందర్
5. తెలుగు సాహిత్య చరిత్ర – ద్వా.నా.శాస్త్రి